# ఫ్రెండ్

-ప్రవీణ

కాలిఫోర్నియా నుండి బయలుదేరిన నేను సుమారు ఇరవై నాలుగ్గంటలు ప్రయాణానంతరం చెన్నైలో దిగాను. లోకల్ టైమ్ రాత్రి పదిన్నర కావొస్తూంది. నాది బిజినెస్ ట్రిప్పు కాబట్టి చెక్ ఇన్ లగేజ్ లేక పోవడం వల్ల నా హ్యాండ్ బ్యాగేజీ తీసుకొని ఇమిగ్రేషన్ చెక్ తర్వాత త్వరగానే బయటికి వచ్చాను. ఎయిర్‌పోర్ట్ బయట 'రోహిత్ టంగుటూరి' అని రాసి ఉన్న బోర్డు పట్టుకొని ఒక వ్యక్తి నన్ను రిసీవ్ చేసుకోవడానికి ఎదురు చూస్తున్నాడు. నేను అతని దగ్గరగా వెళ్ళి "ఐయామ్ రోహిత్" అని పరిచయం చేసుకున్నాను. అతను నాకు మర్యాదపూర్వకంగా నమస్కరించాడు. నా కోసం ఏర్పాటు చేసిన కారు వద్దకు తీసికెళ్ళాడు. కారెక్కాక "సర్ మిమ్మల్ని కంపెనీ గెస్ట్ హవుజ్‌లో దింపి వెళ్తాను. రేపుదయం తొమ్మిదింటికి వచ్చి మీటింగ్ జరిగే చోటుకు తీసుకొనివెళ్తాను" అన్నాడు.

నేనందుకు అంగీకారంగా తలవూపాను.

ఆతర్వాత ఆ వ్యక్తి నన్ను గెస్ట్ హవుజ్‌కి తీసి కెళ్ళాడు. నాకేం కావాలో కనుక్కొని అన్ని ఏర్పాట్లూ చేసి వెళ్ళిపోయాడు. నేను స్నానం చేసి వచ్చి అక్కడే టేబుల్ పైన సిద్ధంగా ఉన్న స్కాచ్ బాటిల్ ఓపెన్ చేసి గ్లాసులోకి స్మాల్ పెగ్ వంపుకొని ఐస్ బాక్స్‌లో నుండి ఐస్ క్యూబ్స్ వేసుకొని, నెమ్మదిగా సిప్ చేస్తూ నా సెల్ ఫోన్‌లో సేవ్ చేసుకున్న ఫోన్ నంబరు నొక్కాను. అవతలి వైపు రింగ్ అవుతూంది. నా మనసు అవతలి వాళ్ళ రిసీవింగ్ కోసం ఎదురుచూడసాగింది. ఐదారు రింగ్‌ల తరువాత "హలో" అన్న మృదువైన కంఠం వినబడింది.

"హలో" అన్న పదం ఆమె కంఠం నుండి ఎంతో నాజూగ్గా, సుమధురంగా వెలువడి నా చెవులకెంతో ఇంపుగా వినబడింది. అది నా ప్రియస్నేహితురాలి కంఠమే అయి ఉంటుందన్న నమ్మకం కలిగింది నాకు. ఎందుకంటే ఆ కంఠంలో ఆమె స్నేహశీలత ధ్వనించింది. ఇంటర్‌నెట్‌లో 'చాటింగ్' ద్వారా మూడేళ్ళుగా మా స్నేహం కొనసాగుతున్నా మేమింత వరకూ ఫోన్లో మాట్లాడుకోవడం గానీ, ప్రత్యక్షంగా కలుసుకోవడం గానీ జరుగలేదు. మొట్టమొదటిసారిగా ఆమెకు ఫోన్ కలిపాను. ఆమె స్నేహస్వభావాన్ని బట్టి ఆ కంఠం ఆమెదే అయి వుంటుందన్న నమ్మకంతో- "హలో ఆర్తీ నేను రోహిత్‌ని" అన్నాను.

"నువ్వు చెన్నైలో దిగగానే ఫోన్ చేస్తావని ఊహించాను రోహిత్, ఓ పక్క నిద్ర ముంచుకు వస్తున్నా కూడా నీ ఫోన్ కాల్ కోసం వెయిట్ చేస్తున్నాను" అన్నదామె.

"రేపు ఇక్కడ పని పూర్తి చేసుకొని ఎల్లుండి సాయంకాలం కల్లా అక్కడికి వస్తాను. ఒకసారి మళ్ళీ నీ అడ్రస్ చెప్పు" అన్నాను పాకెట్ డైరీ తీసి చూసుకుంటూ.

ఆర్తి చెబుతున్న అడ్రస్ అందులో సరిచూసుకొని ఆమె వద్ద సెలవు తీసుకున్నాను.

కాసేపటికి ఖాళీ గ్లాసు టేబుల్‌పై పెట్టి ఏదో కాస్త తిని బెడ్‌పై వాలాను. నేనీసారి ఇండియాకి వచ్చినప్పు డెలాగైనా 'ఆర్తి'ని కలవాలనే ఉద్దేశంతో 'చాటింగ్'లో ఆమె ఫోన్ నంబరు, అడ్రస్ తీసుకున్నాను.

బాగా అలిసి ఉన్న నా శరీరం విశ్రాంతి కోరుకున్నా మనసు మాత్రం ఆమెకూ నాకూ మధ్య స్నేహం ఎలా కుదిరిందో నెమరు వేసుకోసాగింది.

ఓ పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం పొంది హెచ్ వన్ వీసాతో అమెరికా వెళ్ళాను నేను. నా మేన మామ కూతురు వినీల ఎంబిబిఎస్ చదివింది. ఆమెతో నా వివాహం జరిగింది. పెళ్ళి తర్వాత వినీల నా ద్వారా డిపెండెంట్‌గా హెచ్ ఫోర్ వీసా పొంది నాతో పాటు అమెరికా చేరుకుంది. ఆ తర్వాత కొన్నేళ్ళకు గ్రీన్ కార్డు కూడా వచ్చింది. సహజంగా తెలివైన వినీల 'యు.ఎస్.ఎమ్.ఎల్.ఈ' ఎగ్జామ్స్ పాసయ్యి రెసిడెన్సీ, ఫెలోషిప్ పూర్తి చేసి ప్రైవేటు ప్రాక్టీసు చేస్తుంది. మొదలుపెట్టిన కొన్నాళ్ళకే ప్రాక్టీసు ఊపందుకుంది. ఆ మధ్య కాలంలో సాఫ్ట్‌వేర్ రంగానికి గ్రహణం పట్టడంతో ఎంతోమంది సాఫ్ట్‌వేర్ రంగంలో నిపుణులు ఉద్యోగాలు కోల్పోయారు. వాళ్ళలో నేను కూడా ఉన్నాను. ఉన్న పళంగా ఉద్యోగం కోల్పోయిన నేను ఎంత ప్రయత్నించినా ఏడాది పాటు ఎక్కడా సరిఅయిన అవకాశాలు రాలేదు. ఇంట్లో ఊరికే కూర్చోవడం ఇష్టంలేక గాస్‌స్టేషన్స్ (పెట్రోలు బంకులు)లోనో, రెస్టారెంట్స్‌లోనో జాబ్ తీసుకోవడానికి సిద్ధపడ్డాను. సాఫ్ట్‌వేర్ జీనియస్‌నైన నేను 'డిగ్నిటీ ఆఫ్ లేబర్' ఉన్న ఆ దేశంలోనైనా

అలాంటి జాబ్ చేసే స్థితికి దిగజారడం వినీలకు నచ్చ లేదు. అంతేకాక ఒక లీడింగ్ డాక్టరుకు భర్తనైన నేను అటువంటి చిన్న జాబ్‌లు చేయవద్దనీ కొన్నాళ్ళు సహనంతో వేచి చూడమని సలహా ఇచ్చింది. ఆమె మాట మేరకు నేను మరికొన్నాళ్ళు ఓపిక పట్టాను. రానురానూ వినీల ప్రాక్టీసు విపరీతంగా పెరగసాగింది. డబ్బు కుప్పలుతెప్పలుగా వచ్చి పడసాగింది. వినీల ఉదయం ఆరున్నరకే క్లినిక్‌కి వెళ్ళిపోయేది. నేను లేచి పిల్లల్ని రెడీ చేసి స్కూల్లో దింపి వచ్చి ఇంట్లో క్లీనింగ్ పూర్తి చేసేసరికి పిల్లలను తిరిగి తీసుకువచ్చే సమయం అయ్యేది. వాళ్ళను ఇంటికి తీసుకువచ్చాక వాళ్ళకీ, మాకూ ఫుడ్ రెడీ చేసేవాన్ని. ఎంతచేసినా వినీల ఏదో ఒకటి సణిగేది. "ఈరోజైనా లాన్ మూవింగ్ చెయ్య లేదేమిటి రోహిత్ రోజంతా ఖాళీగానే ఉంటావుగా" అనో "ఈరోజు ఇల్లు క్లీన్‌గా లేదనో" అనేది. నా మనసు చివుక్కుమనేది.

వినీల ప్రవర్తనలో క్రమక్రమంగా అహంకారపు ఛాయలు తొంగి చూడసాగాయి. ఉద్యోగం లేక ఉన్న నా పట్ల రోజురోజుకీ ఆమెలో చులకనభావం పెరుగు తున్నట్లనిపించింది. మంచి ఉద్యోగం కోసం పడిగాపులు కాస్తున్న నాలో ఓపిక నశించింది. రానురానూ పెరిగిన వినీల సూటిపోటి మాటలతో నాలోనూ అసహనం పెరగసాగింది. అభిప్రాయభేదాలతో చీటికిమాటికి గొడవపడసాగాము. వీటన్నిటి కారణంగా సహజనం చచ్చిన నేను మా ఇంటికి దగ్గర్లోనే ఉన్న రెస్టారెంట్లో కాష్ కౌంటర్లో జాబ్ తీసుకున్నాను. ఆరోజు వినీలకూ

# సూర్యరథం ఎక్కెయ్యాలి

చాన్నాళ్ళ క్రితం విషయం...
అప్పుడు... నా మంచితనం... పావలా అడిగితే రూపాయి విసిరేవాడిని!
ఇప్పుడు... రూపాయడిగితేనే... పావలా వెయ్యలేకపోతున్నాను... ఎందుకనో!

చాన్నాళ్ళ క్రితం విషయం...
అప్పుడు... నా ఆశయం... అమ్మనీ నాన్ననీ కంటి పాపల్లా చూసుకోవాలనీ...
ఇప్పుడు... వాళ్ళకి కంటి చికిత్స చేయిస్తేనే కూడబెట్టింది కరిగిపోద్దేమోనన్న అదో భయం!

చాన్నాళ్ళ క్రితం విషయం...
అప్పుడు... నా శపథం... పది మందితో జీవనం ఉండాలనీ... జీవించాలనీ...
ఇప్పుడు... 30 ఏళ్ళుగా కాపురం ఉంటున్నా నా పక్కింటి వాడి పేరే నాకు తెలియదు... ఇది నిజంగా నిజం!!

చాన్నాళ్ళ క్రితం విషయం...
అప్పుడు... నా నిర్ణయం... చట్ట పరిధిలోనే బ్రతకాలనీ... బట్ట కట్టాలనీ...
ఇప్పుడు... ఆ చట్టాన్ని మాయచేసైనా నాలుగు రాళ్ళు సంపాదించి మహరాజులా వెలగాలని తహతహ!

చాన్నాళ్ళ క్రితం విషయం...
అప్పుడు... నా నిశ్చయం.. బ్రతికితే మానవత్వం ఉన్న మనిషిగానే బ్రతకాలనీ...
ఇప్పుడు... బ్రతుకు బండి లాగటం కోసం... 'మృగంలా మారి' పోరాడక తప్పదేమో!!
అన్నట్టు... అన్నట్టు... చాన్నాళ్ళ క్రితం విషయం...
అప్పుడు నేననుకున్నదీ... ఇప్పటికీ నేను పాటిస్తున్నదీ...
నాకు మరపురానిదీ, మరువలేనిదీ, మరచిపోనిదీ, మరువబోనిదీ... ఒకటుందండోయ్–
అది... అదే అదే... ఏమిటనుకుంటున్నారు... చెప్పమంటారా...?

హిమాలయ శిఖరం ఎక్కెయ్యాలన్న – ఆరాటం... ఆరాటం... ఆరాటం!
చంద్రమండలానికి దూసుకుపోవాలన్న ఉబలాటం... ఉబలాటం... ఉబలాటం!!
ఇంకోటి చెపుతాను... నవ్వకండేం– సూర్యరథం కూడా ఎక్కెయ్యాలన్న... బులపాటం... బులపాటం... బులపాటం!!!
అన్నీ అనుకూలిస్తేనే సుమండీ– విశ్వరథం కూడా ఎక్కెయ్యాలన్న– బులపాటం... బులపాటం... బులపాటం!!!

–నల్లబాటి రాఘవేంద్రరావు

నాకూ మధ్య తీవ్రమైన వాగ్యుద్ధం జరిగింది. ఆమె నన్ను ఆ ఉద్యోగం మానేయమన్నది. అందుకు నేను ఒప్పుకోలేదు. "అక్కడ వాళ్ళిచ్చే జీతం కంటే రెట్టింపు డబ్బు ఇస్తాను. ఇంట్లో ఉంటే నాకూ పిల్లలకూ మేలు చేసిన వాడివి అవుతావు", అలా అంటున్నప్పుడు ఆమె ముఖంలో కదలాడిన గర్వపు ఛాయలు నా దృష్టిని దాటిపోలేదు. డాలర్ల మహత్యంతో అహంకారపు పొరలు కమ్మిన వినీల మనసుకు నాకిస్తానన్న ఆ డబ్బు ఆమె సంపాదించడానికి నేనే కారణం అన్న విషయం ఆ క్షణంలో స్ఫురణకు రాలేదులా ఉంది. నాతో పెళ్లి జరిగాక ఆమె ఈ దేశానికి తనతో పాటుగా కొన్ని దుస్తులూ, ఎంబిబిఎస్ డిగ్రీతో అడుగుపెట్టింది. ఈ దేశంలో పై చదువులు నేనే చదివించాను. ఈనాటి ఆమె ఉన్నత స్థితికి నేనా రోజు బోలెడు డబ్బు ఖర్చు చేసి చదివించానన్న విషయం వినీల పూర్తిగా విస్మరించింది. ఆమె నోటి నుండి జారిన మాటలు నా అహాన్ని దెబ్బతీసాయి. నేను పట్టరాని ఆవేశంతో ఆ క్షణంలోనే ఇల్లు విడిచి వెళ్ళాను. ఎందుకంటే నేను ఉద్యోగం కోల్పోయాక ఆ ఇంటి మార్టిగేజ్ కూడా వినీల కడుతూందన్న విషయం స్ఫురణకు రావడంతో నేనక్కడ ఒక్క క్షణం కూడా ఉండలేకపోయాను. ఆ ఆవేశంలో నేనలా వెళ్తున్నందువల్ల కలిగే పర్యవసానాల గురించి ఆలోచించలేదు. ఆత్మాభిమానాలూ, అహంకారాల నేపథ్యంలో ఒక భయంకరమైన దుర్ఘటన జరిగింది. సరైన సంరక్షకులు లేకపోవడంతో నా ఐదేళ్ళ కూతురు 'స్నిగ్ధ' ప్రమాదవశాత్తు ఇంటి ముందున్న స్విమ్మింగ్ పూల్‌లో పడి చనిపోయింది. ఆవేశంతో అహంకారంతో భార్యాభర్తలం ఇద్దరం చేసిన పొరపాటుకు ఒక పసిప్రాణం బలైంది. ఎవరూ సరిదిద్దలేని పొరపాటు జరిగింది.

అసలేం జరిగిందో, నేను ఇంట్లో నుండి ఎందుకు వెళ్ళానో తెలియని బంధువులూ, స్నేహితులూ అందరూ నన్నే తప్పుపట్టారు. పైగా పుండు మీద కారం చల్లినట్లు వినీల విడాకులు కోరింది. మా మధ్య నామమాత్రంగా ఉన్న బంధం పూర్తిగా తెగిపోయింది. నా ఆర్థిక పరిస్థితి తెలిసిన వాళ్ళెవ్వరూ నాకాశ్రయం ఇవ్వలేదు. బాగా కుంగిపోయిన నా మనసు నన్నర్థం చేసుకునే హృదయం కోసం తల్లడిల్లింది. ఇంటర్‌నెట్ పైన చాట్ బాక్స్‌లో స్నేహానికై చేయి చాచాను. ఆ సమయంలో నాకు తన స్నేహహస్తం అందించింది 'ఆర్తి'. అలా మూడేళ్ళుగా నెట్‌పైన మా స్నేహం కొనసాగుతూంది. నా మానసిక పరిస్థితిని అర్థం చేసుకున్న 'ఆర్తి' స్నేహం గాయపడిన నా హృదయానికి మందులా పనిచేసింది. 'ఆర్తి' నా చేదు అనుభవాల్ని తెలుసుకొని సానుభూతి చూపింది. జరిగిన దానికి కుంగిపోవద్దనీ, జీవితం అక్కడికే ఆగిపోలేదనీ, శరీరంలో కొనఊపిరి ఉన్నంత వరకూ ఎదురయ్యే ఆటపోట్లను తట్టుకొని ధైర్యంగా ముందుకు సాగిపోవడమే జీవితమనీ విడమర్చి చెప్పి నన్ను మామూలు మనిషిని చేసింది. నా శరీరంలోకి కొత్త శక్తి వచ్చినట్లన్పించింది. అప్పటి నుండి నేను రోజుకి పద్దెనిమిది గంటలు ఏ పని దొరికితే ఆ పని చేస్తూ సంపాదించిన డబ్బు పోగు చేసి బిజినెస్‌లోకి దిగాను. ముందుగా మార్కెట్లోకి డివిడి ప్రింట్లు,వీడియో కాసెట్లు పంపిణీ చేసి మరికాస్త డబ్బు సంపాదించాక ఏకంగా కొత్త తరహాలో ఆనిమేషన్ ప్రక్రియ ద్వారా భారతీయ ఇతిహాసాలు– రామాయణం, మహాభారతం, భాగవతాలను, పంచతంత్ర కథలను ఎన్నో భాషల్లో చిత్రీకరించి వీడియో, ఆడియో కాసెట్లు, సీడీలు, డివిడిలు మార్కెట్లోకి గుప్పించాను. వాటికి దేశ విదేశాల్లో బాగా గుర్తింపు వచ్చింది. దాంతోబాటు విపరీతంగా లాభాలు వచ్చి కోట్లకు పడగలెత్తాను. ఇప్పుడు నాకన్నీ సమకూరాయి.

ఒకప్పుడు నా నీడను చూస్తేనే అల్లంత దూరం పారిపోయిన వాళ్ళంతా నన్ను మళ్ళీ తమతో కలుపుకోవాలని తహతహలాడసాగారు. కానీ నేనెవర్నీ మరీ దగ్గరగా రానివ్వలేదు. నా ఆర్థిక పరిస్థితి బాగా కుదురుకోవడంతో నేను విలాసవంతమైన జీవితం వైపు మొగ్గి అందులో సుఖాల్ని వెతుక్కోసాగాను. కాలిఫోర్నియాలో రెండెకరాల స్థలంలో ఉన్న పెద్ద ఇల్లు కొనుక్కున్నాను. ఏమాత్రం వీలు దొరికినా దేశవిదేశాల్లో సందర్శించ దగ్గ ప్రదేశాలన్నీ తిరిగి వస్తున్నాను.

కానీ టొరంటోలోని నయాగరా జలపాతాలు వీక్షిస్తున్నా, పారిస్ అందాలు సందర్శిస్తున్నా ఏ ప్రాంతం వెళ్ళినా, ఎక్కడ తిరిగినా నాలో రగిలే అశాంతి, గూడు కట్టుకున్న ఒంటరితనం నా వెంటే ఉంటాయి.

నేనెక్కడికి వెళ్ళినా నాతో ఉండే లాప్‌టాప్‌తో రోజూ 'ఆర్తి'తో సంభాషణలు కొనసాగించే వాడిని. అదొక్కటే నా చీకటి జీవితంలో వెలుగురేఖ లాంటిది. ఆమెను ఇంటర్‌నెట్‌లో కలుసుకోగానే నా మనసులోని గుబులు ఎటో ఎగిరిపోతుంది. ఆమె స్నేహ స్పర్శ అలసిన నా హృదయాన్ని తాకి సేదతీరుస్తుంది. ఆమె సెలవు తీసుకుంటానంటే నేను వద్దని మారాం చేస్తాను. ఆమె

నన్ను పసిపిల్లాడిలా సముదాయించి వీడ్కోలు తీసుకుంటుంది.

ఈమధ్య నాలో ఆమెను చూడాలనీ, స్వయంగా కలవాలనే కోరిక బలపడసాగింది. చూడాలని ఉంద న్నప్పుడు ఆమె వెంటనే నెట్‌పైన తన ఫోటో స్కాన్ చేసింది. నిర్మలమైన పెద్దపెద్ద కళ్ళతో, ముత్యాల వంటి పలువరస కాస్త కనబడేలా ఉన్న స్వచ్ఛమైన నవ్వుతో, వదులుకున్న సిల్కులాంటి మెరిసే జుట్టుతో ఎంతో అందంగా ఉంది. కానీ ఆమెను స్వయంగా కలవా లనుందన్న కోరికను వెలిబుచ్చినప్పుడు మాత్రం వెంటనే రెస్పాన్స్ ఇవ్వలేదు. ఆమధ్య బిజినెస్ మీటింగ్స్ కోసం ఒకసారి బాంబేవరకూ మరోసారి ఢిల్లీ వరకూ వచ్చి వెళ్ళాను. ఈసారి చెన్నై రావాల్సి ఉండడంతో 'ఆర్తి'తో నేను చెన్నై వరకూ వస్తున్నాను. అక్కడ్నించి ఊటీలో ఉన్న నిన్ను కలవాలనుంది. నీ ఫోన్ నంబరు అడ్రసూ ఇస్తావా అనడిగాను. నెట్ పైన కొద్ది క్షణాలు గ్యాప్ తరువాత ఆమె తన సెల్ నంబరూ అడ్రసూ ఇచ్చింది. నాకెందుకో ఆమె కాసేపు తటపటాయించి ... అనిపించింది. కానీ నేనా విషయాన్ని అంతగా పట్టించుకోలేదు. ఆమెను కలుసుకోకుండా నేనీసారి ఇండియా వదిలివెళ్ళవద్దని నిర్ణయించుకున్నాను.

"అబ్బా ఆమెని కలుసుకోవాలంటే ఇంకా దాదాపు నలభై గంటలు గడవాలి" అనుకున్నాను నిద్రనాహ్వా నిస్తూ.

☆☆☆

చిక్కని చీకట్లో పొగమంచు తెరలను చీల్చుకుంటూ వెళ్తున్న కారుని నేను చెప్పిన అడ్రస్ గల ఇంటి ముందుకు తీసుకొచ్చి ఆపాడు డ్రైవరు.

నన్ను సాదరంగా ఆహ్వానిస్తున్నట్లుగా ఇంటి గేటు. తలుపులు బార్లా తెరిచి లైట్లన్నీ వేసి ఉన్నాయి. ఒక నడి వయసు వ్యక్తి కారు డోర్ తెరిచి పట్టుకొని "బాబు గారు రండి" అంటూ ఎంతో మర్యాదగా లోపలికి తీసుకువెళ్ళాడు. చాలా పెద్ద ఇల్లు. హాల్లో అంతా ఆంటిక్ ఫర్నిచర్‌తో రాజమహల్‌లా ఉంది. నా దృష్టి హాల్లో ఎదురుగా ఉన్న గోడకు అమర్చి ఉన్న నిలువెత్తు ఫోటోపై పడింది. అందులో ఉన్న వ్యక్తిలో ఆర్తి పోలికలు స్పష్టంగా కనబడుతున్నాయి. నేను తదేకంగా ఫోటోవైపు చూడటం గమనించిన అతను పెదబాబు గారు, ఆర్తమ్మాయి గారి తండ్రి గారు బాబూ, కాలం చేశారు" అన్నాడు.

ఆ వ్యక్తి నన్ను ఒక గదిలోకి తీసికెళ్ళి "బాబు గారూ స్నానం చేసి రండి భోజనం సిద్ధం చేసి ఉంచు తాను" అని కిందికి వెళ్ళబోతూ మళ్ళీ ఒక్క క్షణం ఆగి "నా పేరు కుప్పుస్వామి బాబూ మీకేదన్నా అవసరం ఉంటే పిలవండి" అంటూ వెళ్ళాడు.

నేను బాత్‌రూంలోకి వెళ్ళి స్నానం చేసిన కొద్ది సేపట్లో మళ్ళీ అతనే వచ్చి భోజనం చేయడానికి డైనింగ్ టేబుల్‌వద్దకు తీసికెళ్ళాడు. కానీ అక్కడ కూడా నాకు ఆర్తి తారసపడలేదు. నా ముఖంలో భావాలను పసిగట్టి నట్లుగా "అమ్మాయి గారు మిమ్మల్ని రేపు ఉదయం కలుస్తామన్నారు బాబుగారూ" అని చెప్పాడు కుప్పు

## స్వాగతాంజలి

కొత్త వత్సరం
శ్రీపార్థివ ఉగాదీ
స్వాగతాంజలి

మామిడి కొమ్మ
మా ఎద రెమ్మే సుమా
స్వాగతాంజలి

గండు కోయిల
మా కవి రాగం సుమీ
స్వాగతాంజలి

ఏటేటా నీవు
మా భాగ్యం అనుకుంటాం
స్వాగతాంజలి

ఆటుపోట్లతో
అట్టుడికిపోతున్నాం
స్వాగతాంజలి

సునామీలెన్నో
మా బాధ్యత నీదమ్మా
స్వాగతాంజలి

-బద్ది నాగేశ్వరరావు

స్వామి.

నాకెందుకో కాస్త విచిత్రంగా అన్పించింది. ఎందుకంటే నేను రాగానే ఆర్తి నాకెదురేగి సాదరంగా స్వాగతం చెబుతుందని అనుకున్నాను. కానీ ఇలా పనివాళ్ళు రిసీవ్ చేసుకోవటం నాకు నచ్చలేదు. కానీ ఏమో ఏదైనా బలమైన కారణముందేమో అనుకుంటూ టేబుల్ వైపు చూశాను. పొగలు కక్కుతున్న వేడి పదార్థాలు ఆకలితో ఉన్న నన్ను భోజనానికి కూర్చునేలా చేశాయి. ఆర్తి దగ్గర లేకున్నా పనివాళ్ళు తనకు ఎంతో శ్రద్ధగా కొసరి కొసరి వడ్డించారు. అన్నీ నాకిష్టమైన వంటకాలే. నేనా ఇంట్లోకి అడుగుపెట్టినప్పటి నుండి చూస్తున్నాను. నాకిష్టమైన మ్యూజిక్, బాత్‌రూంలో నాకిష్టమైన సోప్, డ్రెస్సింగ్ టేబుల్‌పైన నాకిష్టమైన పెర్‌ఫ్యూమ్, టేబుల్‌పై నాకిష్టమైన వంటకాలు. ఇన్నాళ్ళ తమ స్నేహంలో ఆర్తి తన రుచులూ, అభిరుచులూ బాగా గ్రహించింది అనుకొని తృప్తిపడుతూ ఆ రాత్రికి పడుకున్నాను.

☆☆☆

నాకు మెలకువ వచ్చేసరికి బాగా తెల్లవారింది. కప్పుకొని ఉన్న రగ్గు తొలగించి లేచి బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ వచ్చి కిటికీ వద్ద నించొని బయటికి చూశాను. మంచులో తడిసిన గులాబీలూ, డేరియాలూ తోటలోకి రమ్మని ఆహ్వానించాయి. నేను త్వరగా స్నానం ముగించుకొని వచ్చేసరికి గదిలోని టీపాయ్ పైన ట్రేలో పాట్ టీ సిద్ధంగా ఉంది. నేను నాక్కావల్సిన మోతాదులో డికాషన్, పాలు, చక్కెర కలుపుకొని టీ తాగి హాల్లోకి వెళ్ళాను. అక్కడ డైనింగ్ టేబుల్‌పైన బ్రేక్ ఫాస్ట్‌కి అన్నీ సిద్ధం చేసి ఉన్నాయి.

టేబుల్ వద్ద అరవై ఏళ్ళ పైబడి ఉన్న ఒకావిడకి మరో నడివయసు స్త్రీ ఇడ్లీ తినిపిస్తూంది. ఆమె వద్దని మారాం చేస్తున్నా ఓపికగా ఆవిడని బతిమిలాడుతూ తినిపిస్తూన్న ఆ దృశ్యాన్ని చూస్తూ ఒకింత ఆశ్చర్యంగా "ఎవరావిడ" అని కుప్పుస్వామిని అడిగాను.

"పెద్దమ్మగారు, ఆర్తి అమ్మాయి గారి తల్లి బాబు గారూ, ఆవిడకి మతిస్థిమితం లేదు' చెప్పాడతను.

"ఓ, అలాగా 'అయ్యో' ఆర్తి నాకీ విషయం చెప్ప లేదు" స్వగతంగా అనుకున్నాను.

"బాబు గారూ రండి అంతా సిద్ధంగా ఉంది" అంటూ ఉపాహారం చేయడానికి టేబుల్‌పైకి పిలిచాడు కుప్పుస్వామి.

"ఆర్తి ఎక్కడ? తను కూడా వస్తే ఇద్దరం కలిసే తింటాం" అన్నాను నేను.

"ఆర్తమ్మాయి గారు లేరు బాబూ స్కూలుకు వెళ్ళారు" అన్నాడు.

"స్కూలా! అదేంటీ..."

"అమ్మాయిగారు చాన్నాళ్ళుగా వికలాంగుల కోసమని ప్రత్యేకమైన శిక్షణా కేంద్రాలను నడుపుతున్నారు. వాళ్ళుండడానికి ప్రత్యేకమైన హాస్టళ్ళనేర్పాటు చేశారు. వాటి పర్యవేక్షణకు ఆవిడ ఉదయం ఏడింటికి వెళ్ళి సాయంత్రం ఆరు గంటలకు వస్తారు" అన్నాడు.

సాయంత్రం ఆరు గంటలకి నేను కోయంబత్తూరు నుండి చెన్నై వెళ్ళే ఫ్లైట్ ఉంది. అంటే నేను కనీసం పన్నెండు గంటలకు బయలుదేరి వెళ్ళాలి. ఈ విషయం తెలిసి కూడా ఈరోజైనా ఆర్తి తనని కలువకుండా అలా వెళ్ళిపోవడం నాకసలు నచ్చలేదు. ఏమిటింత అమర్యాదగా ప్రవర్తించింది. తనిక్కడికి ఆమెను కలవడానికి వచ్చాడే గానీ భోంచేయడానికి, విశ్రాంతి తీసుకోవడానికీ రాలేదు. నేను కాస్త కోపంగా కుప్పుస్వామి వైపు చూస్తూ– "నేను వెంటనే ఆర్తిని కలవాలి ఆ స్కూలెక్కడుందో చెప్పు, నేనావిడని కలిసి అట్నుంచటే వెళ్ళిపోతాను" అంటూనే గదిలోకి వెళ్ళి నా సూట్‌కేస్ తీసుకొని విసురుగా బయటికి వచ్చాను.

"బాబుగారూ... అదీ..." నసుగుతూ ఆగిపోయాడు.

"మీ అమ్మాయిగారు నన్ను కలవకుండా ఎందుకో తప్పించుకుంటున్నారని అర్థం అవుతూంది. కానీ ఆమె ఏదో బలమైన కారణం లేందే అలా చేయదు. ఇన్నాళ్ళ మా స్నేహంలో నేను ఆమాత్రం అర్థం చేసుకోగలను. కానీ ఆ కారణమేంటో నాకు తెలియాలి కుప్పుస్వామి. నన్ను ఆర్తి దగ్గరకు తీసుకెళ్ళు..." అర్థింపుగా అడిగాను.

అతడేమనుకున్నాడో ఏమో గానీ "పదండి బాబు గారూ" అంటూ బయలుదేరాడు.

మేం అక్కడికి చేరడానికి సుమారు పది నిమిషాలు పట్టింది. సుమారు పదెకరాల స్థలంలో ప్లాంటింగ్ రూఫ్‌తో ఉన్న నాలుగు బ్లాకులు నిర్మించబడి ఉన్నాయి. అందులోని ఒక బిల్డింగ్ వైపు చూపి అక్కడ కారాపమన్నాడు కుప్పుస్వామి. అక్కడ ప్లే గ్రౌండ్‌లో ఎంతో మంది వికలాంగులైన విద్యార్థులకు కొన్నిరకాల ఆటల్లో శిక్షణ ఇవ్వటం కనబడింది నాకు. పాఠాలు బోధిస్తున్న కొన్ని తరగతి గదులను దాటుకుంటూ మేం ఒక పెద్ద హాల్లోకి వెళ్ళాం. అక్కడ మ్యూజిక్ క్లాస్ జరుగుతూంది. రకరకాల వాయిద్యాలను నేర్చుకుంటూన్న బాల

బాలికలను చూస్తూ వాళ్ళకెదురుగా కుర్చీలో కూర్చొని ఉంది ఆర్తి. ఫోటోలో లాగానే ఆహ్లాదకరమైన చిరు నవ్వుతో, ప్రశాంతత నిండిన ముఖంతో ఉన్న ఆర్తి వైపు వెళ్ళబోయిన నేను కొరడా దెబ్బ తగిలిన వాడిలా అదిరిపోయాను. 'అదేమిటి ఆర్తి వీల్ ఛెయిర్‌లో కూర్చుని ఉందేమిటి', నా కళ్ళు అసంకల్పితంగా ఆమె కాళ్ళవైపు చూశాయి.

"మై గాడ్, ఆర్తికి రెండు కాళ్ళూ లేవు." నేనిక ఆగలేక పరుగున లేవలేని ఆమె దగ్గరకు వెళ్ళి చేతులు పట్టుకున్నాను. నాకేం మాట్లాడాలో కూడా తోచలేదు.

"కుప్పుస్వామి నన్ను ఆఫీస్ రూంకి తీసుకెళ్ళు" అన్నది ఆర్తి.

అతడామె వీల్ ఛెయిర్‌ని తోసుకుంటూ మీరూ రండి బాబు గారూ అంటూ ఆఫీస్ రూంలోకి తీసు కెళ్ళాడు. గదిలోకి వెళ్ళాక శక్తినంతా కూడగట్టుకొని గొంతులోకి తెచ్చుకొని "ఆర్తీ ఐయామ్ సారీ. ఇదంతా నాకు తెలియదు" అన్నాను అలా అంటూంటే నా కంఠం నాకే ఎలాగో విన్పించింది.

"ఇదంతా అంటే" ఆర్తి అడిగింది.

మీ తండ్రిగారు పోవడం, తల్లి గారికి మతిస్థిమితం లేకపోవడం. నీ.. నీ... పరిస్థితి... ఇలా... వీల్ ఛెయిర్ వైపు చూస్తూ అర్ధోక్తిలో ఆగిపోయాను.

కాసేపు మా మధ్య మౌనం.

నేనే మళ్ళీ అన్నాను. నాకు... నాకెందుకు చెప్ప లేదు.

"చెప్తే ఏం చేసేవాడివి రోహిత్. నా జీవితం కొమ్మలు నరికిన చెట్టు లాంటిదైతే వర్షం పడితే చిగురించేది. కానీ నా జీవితం మోడువారిన చెట్టు లాంటిది. నదీ ప్రవాహాన్ని మొత్తంగా మళ్ళించినా చిగురించే ప్రసక్తే లేదు... కాకపోతే ఈ మోడుకు ఎలాంటి తుఫాను గాలుల ఆటుపోట్లనైనా తట్టుకొని నిలబడగలిగే శక్తి చేకూరింది" అన్నది చిరునవ్వుతో.

ఆమె అంత స్వచ్ఛంగా ఎలా నవ్వగలదో నాకర్థం కాలేదు.

"సుమారు ఆరేళ్ళ కిందట అమ్మాయి గారి పెళ్ళి కుదరటంతో దుస్తులూ, నగలూ కొనడానికని అంతా కార్లో బెంగుళూరుకు బయలుదేరారు. దోవలో ఎదురుగా వస్తూన్న లారీ బలంగా ఢీకొనడంతో కార్లో ముందు కూర్చున్న పెద్దయ్యగారూ, డ్రైవరూ అక్కడి కక్కడే మరణించారు. వెనుక కూర్చున్న అమ్మగారూ, అమ్మాయిగారూ కార్లోంచి బయటికి పడ్డారు. రోడ్డు వైపు పడ్డ అమ్మాయిగారి కాళ్ళపై నుండి ఏదో వాహనం వేగంగా వెళ్ళడంతో రెండు కాళ్ళూ నుజ్జునుజ్జు అయ్యాయి. అవతలి పక్క పడ్డ అమ్మగారి తల ఫుట్ పాత్‌కి తగిలి మతిస్థిమితం కోల్పోయింది.

ఈ విషాదాన్ని ఎంతో గారాబంగా పెరిగి కష్ట మంటే ఏంటో తెలియని అమ్మాయిగారు ఎలా తట్టు కుంటారో అని మేమంతా ఎంతో ఆందోళన చెందాం బాబుగారూ, కానీ అందుకు విరుద్ధంగా అమ్మాయి గారు ఎంతో మానసిక స్థైర్యంతో ఎదుర్కొన్నారు. తనక్కాబోయే భర్త మరో అమ్మాయిని పెళ్ళి చేసుకుం టుంటే ఆ పెళ్ళి దగ్గరుండి మరీ జరిపించారు. ఆ తరువాత తమ టీ తోటలూ, ఎస్టేటు వ్యవహారాలు చూసుకుంటూనే తన జీవితానికి అర్థమంటూ ఉండా లని ఈ వ్యాపకాన్ని పెట్టుకున్నారు, ఇలా వికలాంగుల కోసం ఈ శిక్షణా కేంద్రాన్ని నెలకొల్పారు" అన్నాడు కుప్పుస్వామి వలవలా ఏడుస్తూ.

ఏకధాటిగా అతడు చెప్పిన విషయాలు వింటూన్న నా కళ్ళలో నుండి నీళ్ళు ధారగా రాసాగాయి. అది గమనించిన ఆర్తి "నీ సున్నితమైన మనసు గ్రహించాను కనుకనే ఈ విషయాలన్నీ నీతో చెప్పలేదు రోహిత్ అందుకే నువ్వు నన్ను కలవడానికి ఇష్టపడలేదు. ఎప్పటికప్పుడు తప్పిస్తూ వచ్చాను... నువ్విదంతా చూసి తట్టు కోలేవని నాకు తెలుసు..." నేనామె మాటలకు అడ్డు వచ్చాను.

నిజమే నేను తట్టుకోలేకపోయేవాడ్నే. కానీ నిన్ను కలుసుకున్న తర్వాత నీ వృత్తాంతం విన్న తర్వాత నాలో ఇంకా గూడుకట్టుకొని ఉన్న అశాంతికి కారణమేమిటో అర్థమయ్యింది. పుట్టెడు దుఃఖాన్ని దిగమింగి నువ్వు చెరగని చిరునవ్వుతో విధివంచితుల కోసం అలవోకగా చేస్తున్న సేవ నన్ను కదిలించివేసింది. నీ స్నేహితునిగా నా కర్తవ్యం ఏమిటో బోధపడింది. నువ్వు చేపట్టిన ఈ బృహత్ కార్యంలో నన్నూ పాలు పంచుకోనివ్వు ఆర్తీ... అన్నాను అభ్యర్థిస్తూ. ఆమె చేతుల్ని నా చేతుల్లోకి తీసుకున్నాను.

మళ్ళీ ఆమె పెదవులపై అదే స్వచ్ఛమైన చిరునవ్వు వెలిగింది. నా అభ్యర్థనని మన్నించినట్లుగా.

నేను త్వరలోనే మళ్ళీ కలుస్తానని ఆమె వద్ద వీడ్కోలు తీసుకొని బయలుదేరాను. చిత్రంగా నా హృదయంలో ఎన్నాళ్ళుగానో గూడు కట్టుకొని ఉన్న అశాంతి, ఒంటరితనం తొలగి హృదయం తేలికగా అనిపించసాగింది. ■